క్లుప్తంగా

వలంటీర్ల ఇంటర్వ్యూలకు 170 మంది హాజరు



ఇంటర్వ్యూ చేస్తున్న డెప్యూటీ కమిషనర్ బి శ్రీనివాసరావు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు బుధవారం డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా 381 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం 298 మందిని అర్హులుగా ప్రకటించగా, వారిలో 170 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపికైన వారి ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, వారంతా ఈ నెల 17 నుంచి విధుల్లో చేరాలని డెప్యూటీ కమిషనర్లు తెలిపారు.

డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరులో బీపీ మండల్ విగ్రహ ఆవిష్కరణకు ఎంతో కృషి చేసిన బీసీ సంఘ నాయకులు, విగ్రహ దాత డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లును బుధవారం ఆలా హాస్పిటల్‌లో బీసీ ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మెడికల్ రిజర్వేషన్‌లో అనాలోచిత, అక్రమ విధానాలపై సుప్రీం కోర్టును ఆశ్రయించి, వేలాది మంది రిజర్వేషన్ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు వచ్చేవరకు న్యాయస్థానంలో డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పోరాడారని అసోసియేషన్ నేతలు కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి శివపూర్ణయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కట్టిబోయిన నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు, ప్రచార కార్యదర్శి వరికల్లు శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, వరగాని శివనాగేశ్వరావు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ ఏకనాథ్

గుంటూరు ఈస్ట్: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడ్ని పట్టాభిపురం పోలీసులు కొన్ని గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేటకు చెందిన షేక్ సమీరా కుమారుడు ఆరు సంవత్సరాల సాహిద్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఒంటరిగా ఉండటం పోలీసులు గమనించి స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో బాలుడు అదృశ్యమైనట్లు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాలుడ్ని అక్కడకు తీసుకెళ్లి తల్లి సమీరాకు అప్పగించారు. కుమారుడిని అప్పగించినందుకు ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే ముస్తఫా



స్థానికుల నుంచి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: గత ప్రభుత్వాలు పేదల్ని ఏ మాత్రం పట్టించుకోలేదని, సొంతింటి కల కలగానే మిగిల్చిందని ఎమ్మెల్యే ముస్తఫా విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సొంతింటి కలను సాకారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 55వ డివిజన్ బొంగరాలబీడు, శాంతినగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.బొంగరాలబీడు ప్రాంతంలో అధికంగా జగనన్నకాలనీల్లో ఇళ్లు మంజూరు అయ్యాయని స్థానికులు చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. పలు వీధుల్లో కాల్వలు నిర్మించాలని అక్కడి ప్రజలు దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, డివిజన్ కన్వీనర్ పులివర్తి రమణయ్య, పార్టీ నేతలు యోగయ్య, మరియమ్మ, సత్యనారాయణ, సలాం, పిచ్చయ్య, భానుప్రకాష్, కిరణ్‌కుమార్, ప్రకాశరావు, ఎన్. రవి, వరలక్ష్మి, సత్యవతి, అన్నపూర్ణ, బాబు, వినోద్, రూత్‌రాణి పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గం పదో డివిజన్ పొన్నూరు రోడ్డులోని జున్ను షాహిద్ నగర్‌లో డ్రెయినేజీ పైపులైను మరమ్మతుల ఇళ్లు కోల్పోయిన వారిలో అర్హులకు జగనన్న కాలనీలో స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. ఇళ్లు కోల్పోయిన బాధితులు న్యాయం చేయాలంటూ బుధవారం సాయంత్రం పొన్నూరు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే నిరసకారులతో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి వారితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పైపులైను లీకుల వల్ల పరిసర ప్రాంత ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్న దృష్ట్యా మరమ్మతులు చేయాల్సిన అవసరం వచ్చిందని, సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

మాతృ మరణాలు అరికట్టేందుకు కృషి

డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: వైద్యులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి మాతృ మరణాలు అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన మాతృ మరణాలపై జిల్లాస్థాయి మదింపు సమావేశం నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఆలు, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణి పేరు నమోదు చేసిన నాటి నుంచి క్రమం తప్పకుండా వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య పరిస్థితిని వారికి వివరిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి ముందస్తుగా చికిత్స చేయించడం ద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. స్థానిక ఆసుపత్రి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు గర్భిణులను కాన్పు నిమిత్తం తీసుకెళ్లినట్లయితే తక్షణమే ఆ విషయాన్ని సూపరింటెండెంట్‌కు తెలియజేయడం వల్ల వారు తగిన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. జనవరిలో జిల్లాలో జరిగిన మాతృ మరణంపై సంబంధిత ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బందితో ఆయన చర్చించారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డీఐఓ డాక్టర్ సుబ్బరాజు, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జయంతి, డాక్టర్ సుస్మిత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ సుప్రద, డాక్టర్ యాని గ్రేస్ పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణ చర్యలు అవసరం

వేసవికి ముందే ఎండలు అధికంగా ఉండటం వల్ల ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సూచించారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోయి డీహైడ్రేషన్‌కు గురవుతారని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వడదెబ్బ సోకకుండా లేత రంగులో, తెలుపు రంగు ఉన్న వస్త్రాలు ధరించాలని చెప్పారు. ఎండ తగలకుండా తలకు టోపీ ధరించాలని, తేలికగా జీర్ణమయ్యే శాకాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. పరీక్షల సమయంలో అపరిశుభ్రమైన వాతావరణంలో విక్రయించే పానీపూరి, న్యూడిల్స్, పిజ్జా, బర్గర్, తదితర జంక్ ఫుడ్లు మానివేయడం చాలా ఉత్తమని విద్యార్థులకు సూచించారు. ఆరుబయట ఈగలు వాలిన, దుమ్ము, ధూళి పడిన తినుబండారాలు తిని రోగాలు కొని తెచ్చుకోవద్దని చెప్పారు. మంచినీరు ఎక్కువగా తాగాలని, కొబ్బరి నీరు, నిమ్మరసం, మజ్జిగ, షరబత్ పానీయాలు తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన లవణాలు తిరిగి పొందవచ్చని సూచించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తరువాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి లేకుండా యోగ చేయాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: కొత్తపేటలోని గణేశ్వరరావు వీధిలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం దశమ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి కాకడా హారతి, నిత్య పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ సాయి దుర్గ సంకీర్తన భజన మండలి ఈశ్వర్, జయలక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పారాయణం, సాయి నామ సంకీర్తనల్ని ఆలపించాయి. కార్యక్రమాన్ని నిర్వాహకులు వి.యల్. నరసింహారావు పర్యవేక్షించారు.

విద్యార్థుల సెల్‌ఫోన్లు చోరీ

గుంటూరు ఈస్ట్: పరీక్ష రాసేందుకు వచ్చిన 20 మంది డిగ్రీ విద్యార్థులు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఘటన లక్ష్మీపురంలో జరిగింది. సిమ్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాసేందుకు బుధవారం లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళ కళాశాలకు వచ్చారు. తమ సెల్‌ఫోన్లను ఒక వాహనంలోని బ్యాగులో పెట్టి పరీక్ష రాసేందుకు హాలులోకి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా అవి కన్పించలేదు. విద్యార్థులందరూ ఒకే బ్యాగులో సెల్‌ఫోన్లు పెట్టడం గమనించిన ఆగంతకుడు చోరీ చేశాడు. ఈ మేరకు విద్యార్థులంతా పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరుకు పోలీసులు ఫిర్యాదు పంపారు. సెల్‌ఫోన్లు గుర్తించేందుకు సాంకేతిక సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు.

ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న పాటిబండ్ల రామకృష్ణ

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా నూతన అధ్యక్షుడిగా తుల్లిమిల్లి రామకృష్ణను నియమిస్తూ బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ ఉత్తర్వులు అందజేశారు. గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు అనుమోలు ఏడుకొండలు గౌడ్, జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు తాళ్ల వెంకటేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, ఆవుల నాగేంద్ర యాదవ్, పాలపాటి రవికుమార్, అమ్మిశెట్టి ఆంజనేయులు, కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగా తదితరులు రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

గ్రామీణ క్రీడలకు బీజేపీ అధిక ప్రాధాన్యత

గుంటూరు మెడికల్: గ్రామీణ క్రీడలకు బీజేపీ అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కేతినేని సురేంద్ర మోహన్ తెలిపారు. బీజేపీ యువ మోర్చా జిల్లా ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ స్టేడియంలో కబడ్డీ పోటీల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేంద్ర మోహన్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఒలింపిక్స్ స్థాయికి తీసుకెళ్లాలనేది బీజేపీ ధ్యేయమని పేర్కొన్నారు. క్రీడల్లో విజేతలకు నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీతారాం బిల్డర్స్ అధినేత మామిడి సీతారామయ్య, జాతీయ లేబర్ బోర్డ్ చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, యువమోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణ, ఈదర శ్రీనివాసరెడ్డి, తానుచింతల అనిల్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సురేంద్ర మోహన్ తదితరులు

తాగునీటి సమస్య లేకుండా చూడండి: మేయర్



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రానున్న వేసవిలో నగరంలో తాగునీటి సమస్యలు ఏర్పడకుండా ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధికారుల్ని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గ పరిధి 56వ డివిజన్‌లోని నెహ్రూనగర్ రిజర్వాయర్ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సదరు డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. టెండర్ తగ్గించుకున్న కాంట్రాక్టర్లు తక్షణమే పనుల్ని ప్రారంభించాలని చెప్పారు. పనులు మొదలెట్టని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆయన చెప్పారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు ప్రాంతాల్లో పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగు నీరు వృథాగా పోతోందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఏఈలు వెంటనే స్పందించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆయన సూచించారు. పనులు చేసే సమయంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా వారికి ముందస్తు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ, పాపతోటి అంబేడ్కర్, ధూపాటి వంశీ బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, ఈఈ శాంతిరాజు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలు

కళాశాల విద్య ఆర్జేడీ జ్యోత్స్నకుమారి



శివరామకృష్ణశర్మ దంపతులను సత్కరిస్తున్న జ్యోత్స్నకుమారి, కుటుంబరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలని కళాశాల విద్య ఆర్జేడీ వి.ఆర్.జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బుధవారం చెరువు సూర్యనారాయణమూర్తి–సీతారామమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ భారతీయ కళలు మానసిక ఆనందంతో పాటు దేశభక్తి ప్రబోధించి, సంస్కృతిపై ఎనలేని ప్రభావం చూపాయని చెప్పారు. హిందూ కాలేజీ – హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ హరికథ వంటి కళలు అంతరించి పోకుండా సంబంధిత కళాకారులకు తగిన ప్రోత్సాహం, చేయూత నివ్వాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడినప్పుడే ప్రజలకు మన సాంస్కృతిక విలువలు తెలుస్తాయని చెప్పారు. పురస్కార గ్రహీత, హరికథా కౌముది బ్రహ్మశ్రీ ధూళిపాళ శివరామకృష్ణశర్మ భాగవతార్ మాట్లాడుతూ సినిమాల ప్రభావంతో కళలకు ఆదరణ తగ్గినప్పటికీ, హరికథ వంటి కళా రూపాలు ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాగవత, శతక పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన భక్తప్రహ్లాద హరికథాగానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, హిందూ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పుట్టారావు



నూతనంగా ఎన్నికైన సంఘం నేతలతో ఏపీ ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (ఏపీ ఎన్జీవో అనుబంధం) గుంటూరు నగర శాఖ అధ్యక్షుడిగా వి.పుట్టారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవో గుంటూరు నగర కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్ వ్యవహరించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.సూరిని ఎన్నుకున్నారు. సహాధ్యక్షురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా టి భాస్కర్, ఏ అరుణ, సీహెచ్. వి.కృష్ణ, కార్యదర్శిగా ప్రేమ్ సాగర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం. సాంబయ్య, సంయుక్త కార్యదర్శిగా సంగీతరావు, రవి నాయక్, అరుణ, మహిళా సంయుక్త కార్యదర్శిగా షేక్ కరీమున్నీసా, కోశాధికారిగా ఎం. రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.